క్లుప్తంగా

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



లింగ నిర్ధారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుత్తి: లింగ నిర్ధారణ పరీక్షలు, బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని రైల్వే ఆస్పత్రి వైద్యుడు వెంకటేష్ అన్నారు. గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఆస్పత్రి వద్ద గురువారం లింగ నిర్ధారణ, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలికల పట్ల లింగ వివక్షత చూపకూడదన్నారు. బాలురతో సమానంగా బాలికలను చదివించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ వెంకటేష్, స్టాఫ్ నర్స్ ఝాన్సీరాణి, హరి శంకర్, శ్రీధర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

గుంతకల్లుటౌన్: మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనమివ్వాలని ఉద్యోగ జేఏసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లేష్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ గురువారం పట్టణంలో కార్మికులు నిరసన ర్యాలీ చేపట్టారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సురేంద్ర, మస్తాన్, సుంకన్న, లక్ష్మీనారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలను సద్వినియోగం చేసుకోండి

పామిడి: 2025–26కు సంబంధించి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాల దరఖాస్తులను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ గురువారం తెలిపారు. కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులకు గాను 500 సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అదనపు సమాచారం కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కసాపురంలో ధన్వంతరి హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం ధన్వంతరి హోమం ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రజలు ఆరోగ్యంగా వర్ధిల్లాలని కోరుకుంటూ ధన్వంతరి హోమంనిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

జూదరుల అరెస్టు

పెద్దపప్పూరు: మండలంలోని నరసాపురంలో గురువారం పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేశామని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.33 వేల నగదు, ఎనిమిది సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, నిందితులను కోర్టుకు హాజరు పరిచామన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



శ్రీచైతన్య స్కూల్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గుంతకల్లుటౌన్: ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్‌నాయక్, అఖిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఫీజుల దోపిడీని వ్యతిరేకిస్తూ గురువారం ఏఐఎస్ఎఫ్ నాయకులు తిలక్‌నగర్‌లోని శ్రీచైతన్య స్కూల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అత్యధిక ఫీజులతో పాటు పుస్తకాల పేరిట వేల రూపాయలు వసూలు చేస్తున్నారని వారు ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్న ఆయా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో అనుమతుల్లేకుండా నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్లను విద్యాశాఖ అధికారులు సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు ఫర్హాన్ ఖదీర్, ముస్తఫా, అర్షద్, అబ్రార్, భాస్కర్, ఫరూఖ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ సాగుకు సెలవు!

- తాడిపత్రి మండలంలో నో రిజిస్ట్రేషన్
- గణనీయంగా తగ్గనున్న వేరుశనగ సాగు
- ఇతర పంటలపై చూపుతున్న ఆసక్తి



తాడిపత్రి రూరల్: తాడిపత్రి వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఏడాదికేడాదికి వేరుశనగ పంట సాగు గణనీయంగా తగ్గుతోంది. వేరుశనగ పంట ఖర్చుతో కూడుకున్నది కావడంతో పాటు అరకొర దిగుబడులు వస్తుండటంతో రైతులు పంటకు సెలవు ప్రకటిస్తున్నారు. వేరుశనగ పంట స్థానంలో పత్తి పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. వేరుశనగ పంటను రైతులు సాగు చేయకపోవడానికి వర్షాభావ పరిస్థితులు కూడా కారణమే. అరకొర దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రాని పరిస్థితి. ఒకప్పుడు తాడిపత్రి వ్యవసాయ సబ్‌డివిజన్‌లో వేరుశనగ సాగు అగ్రస్థానంలో ఉండేది. గతంలో ప్రభుత్వం రైతులకు నాణ్యమైన వేరుశనగ కాయలు పంపిణీ చేసేది. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి సరఫరా చేసే కాయల్లో నాసిరకం ఎక్కువశాతం ఉండటంతో పాటు సబ్సిడీ కూడా తక్కువగా ఉండటం కూడా రైతులు సాగుపై ఆసక్తి చూపడం లేదు. వేరుశనగ కాయల కోసం రిజిస్ట్రేషన్ల కోసం పది రోజుల నుంచి రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది ఎదురు చూస్తున్నా ఒక రైతు కూడా అటువైపు వెళ్లలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

అందని పెట్టుబడి సాయం

రైతులు పండించే పంటలకు కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయంపై మీనమేశాలు లెక్కిస్తోంది. గత ఏడాది రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామన్న ప్రభుత్వం చివరికి మొండి చేయి చూపింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి సాయంపై ప్రకటనలు లేవు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.13.500 అందించేవారు. ఈ సాయంతో రైతులు విత్తనాలు, ఎరువులు ఇతర వాటి కోసం వ్యయం చేసేవారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయంపై ఊసెత్తకపోవడంతో రైతులు ఇతర పంటల సాగు కోసం వివిధ మార్గాల ద్వారా వడ్డీలకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇతర పంటల విత్తనాలకు లేని సబ్సిడీ

తాడిపత్రి ప్రాంతంలో సాగు చేసే వేరుశనగ పంటకు తప్ప ఇతర పంటల సాగు కోసం అవసరమైన విత్తనాలకు సబ్సిడీ లేదు. దీంతో అధిక ధరలు చెల్లించి విత్తనాలను కొనుగోలు చేయాల్సి వస్తోంది. వేరుశనగతో పాటు మొక్కజొన్న, పత్తి, కంది తదితర పంటలను సాగు చేస్తున్నారు. కంది పంటకు విత్తనాలకు సబ్సీడీ ఉంది. అయినప్పటికీ ఇంత వరకు విత్తనాల మంజూరు కాలేదు. రైతులు సాధారణంగా ఎల్ఆర్‌జీ–50 రకం కందిని సాగు చేస్తారు. ఎక్కువ దిగుబడి వస్తుందంటూ పీఆర్‌జీ–175 రకం కంది విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. కానీ కంది విత్తనాల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది.

50 శాతం వేరుశనగ మాత్రమే మంజూరు

ఖరీఫ్ సీజన్‌లో తాడిపత్రి వ్యవసాయ సబ్ డివిజన్‌లో 3,710 క్వింటాళ్లు వేరుశనగ సాగుకు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపగా 1830 క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. మిగిలిన కాయలను రెండో విడవ పంపుతామని అధికారులు అంటున్నారు.

తాడిపత్రి వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఇలా..

మండలం	విత్తన వేరుశనగకు పంపిన ప్రతిపాదనలు	కేటాయింపు
తాడిపత్రి	160 క్వింటాళ్లు	80 క్వింటాళ్లు
నార్పల	3250 క్వింటాళ్లు	1600 క్వింటాళ్లు
పెద్దపప్పూరు	200 క్వింటాళ్లు	100 క్వింటాళ్లు
పుట్లూరు	100 క్వింటాళ్లు	50 క్వింటాళ్లు



వ్యవసాయ సబ్‌డివిజన్ కార్యాలయం

అర్హులందరికీ విత్తన పంపిణీ



రైతుల అవసరాల అనుగుణంగా వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తాం. ప్రస్తుతం మొదటి విడతగా 40శాతంతో సబ్సిడీ కాయలు వచ్చాయి. ఈ కాయలను రైతులు కొనుగోలు చేస్తే రెండో విడత మళ్లీ అందజేస్తాం. విత్తన కాయల కొరత లేదు. ఆసక్తి ఉన్న రైతులు రైతులు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

– చెంగళరాయుడు, ఏడీఏ

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



యాడికిలో చిన్నారులతో అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న అధికారులు



పామిడిలో మంజు టాకీస్ అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరభ్యాస కార్యక్రమ దృశ్యం

యాడికి/పామిడి: యాడికి మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో గురువారం నిట్టూరు, మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువు తున్న 50మంది చిన్నారులకు వారి తల్లుల సమక్షంలో ఐసీడీఎస్ అధికారులు సామాహిక అక్షరాభ్యాస కార్యక్రమం, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. యాడికి మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ కుమారి సమక్షంలో తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ వీరాజు, తాడిపత్రి సీడీపీఓ సాజిదాబేగం, యాడికి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి పరమేశ్వర, ఆసుపత్రి సూపర్‌వైజర్ రాం ప్రసాద్ గౌడ్, ఎంఈఓ కాశెప్ప జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు. అలాగే పామిడి పట్టణంలోని మంజు టాకీస్, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలకు సంబంధించిన అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం చిన్నారుల అక్షరభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గుత్తి ఐసీడీఎస్ శాఖ సూపర్‌వైజర్ రామలక్ష్మి , అంగన్‌వాడీ సిబ్బంది జయంతి, షేకున్‌బీ, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఉమా మహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం: రైతులు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్' కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆమె హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రూ. 6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 వేలు జమ చేస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,70,794 మంది లబ్ధి పొందుతారన్నారు. 80 శాతం సబ్సిడీతో డ్రోన్ స్ప్రేయర్లు అందిస్తున్నామని, ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి కొనుగోలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శశికళ, జాహ్నవి, శ్రీనివాస నాయక్, రఘు, చరణ్, రైతులు పాల్గొన్నారు.

రైతులందరికీ విత్తనం పంపిణీ చేస్తాం

బుక్కరాయసముద్రం: అర్హులైన రైతులందరికీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ అన్నారు. గురువారం మండలంలోని సిద్ధరాంపురం గ్రామంలో రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 1300 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం కేటాయించామన్నారు. వేరుశనగ సాగు చేసే రైతులు ముందుగా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, పసుపుల శ్రీరామిరెడ్డి, సర్పంచులు నారాయణస్వామి, కల్పన, మండల వ్యవసాయ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి, హార్టికల్చర్ సహాయకులు మునికుమార్ తిరుమలేష్ రైతులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు



ఎస్.తిమ్మాపురం గ్రామానికి వెళ్లే రోడ్డుపై కంకర తేలిన దృశ్యం

పుట్లూరు: మండలంలోని ఎస్.తిమ్మాపురానికి వెళ్లే రోడ్డు కంకర తేలి ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే రోడ్డు నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తామన్న కూటమి ప్రభుత్వం గ్రామీణ రోడ్ల వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాడిపత్రి–యల్లనూరు ప్రధాన రోడ్డు నుంచి ఎస్.తిమ్మాపురం గ్రామానికి దాదాపు కిలోమీటర్ మేరకు రోడ్డు ఉండగా కంకర తేలి, గుంతలు ఏర్పడటంతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎట్టకేలకు విత్తన వేరుశనగ పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..



గుంతకల్లులో విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: రైతన్నలు ఎప్పుడెప్పుడా అని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమం గుంతకల్లు మండలంలో గురువారం ప్రారంభం అయింది. ఖరీఫ్ సీజన్‌ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా మండలంలో విత్తన వేరుశెనగ పంపిణీ చేయకపోవడం, అదును దాటిపోతుందేమోనన్న భయంతో రైతులు కొంత మంది ఇప్పటికే కందిపంటను సాగు చేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో గురువారం సాక్షి దినపత్రికలో విత్తన పంపిణీ మొదలుపెట్టరా? అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. వెంటనే స్పందించిన అధికారులు, నాయకులు గురువారం మండలంలోని దోశలుడికిలో విత్తన పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. ఏఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మొదటిరోజు మండల వ్యాప్తంగా 350 మంది రైతులకు 315 క్వింటాళ్ల విత్తన వేరుశనగను పంపిణీ చేశామన్నారు. టీడీపీ నాయకుడు నారాయణస్వామి, రైతులు పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని దేవరపల్లి గ్రామ రైతుసేవా కేంద్రంలో గురువారం ఏఓ డీ లీనా వసుంధర ఆధ్వర్యంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విత్తన పంపిణీని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్ లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ, సచివాలయ సిబ్బంది, రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'అంత్యక్రియలకు రూ.వేలల్లో వసూలు'

తాడిపత్రి రూరల్: పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియల కోసం నిర్వాహకులు వేలాది రూపాయలను వసూలు చేస్తున్నారని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి దృష్టికి వీహెచ్‌పీ రాయలసీమ మాజీ అధ్యక్షుడు రాధాక్రిష్ణ తీసుకువచ్చారు. పట్టణంలోని పెన్నానది ఒడ్డున హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పేరుతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్మశాన వాటిక అభివృద్ధితో పాటు అంత్యక్రియల వసూళ్లు తగ్గించాలని చైర్మన్‌ను ఆయన కోరారు. ఇతర మతాలకు చెందిన శ్మశాన వాటికల్లో అంత్యక్రియల కోసం రూపాయి కూడా వసులు చేయరని, హిందూ శ్మశాన వాటికలో మాత్రం రూ.వేలల్లో వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. వసూళ్ల పేరుతో పీడిస్తుండటంతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదల కోసం ఉచితంగా అంత్యక్రియలు చేయించే ఏర్పాటు చేస్తానని, అధిక వసూళ్లపై తగు చర్యలు తీసుకుంటానని చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు అంకాల్‌రెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయటే 'చదువు' ..



దిమ్మగుడి జెడ్పీ పాఠశాలలో చెట్ల కింద కూర్చొన్న విద్యార్థులు

పెద్దవడుగూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు సమస్యలతో విద్యార్థులకు స్వాగతం పలికాయి. గురువారం ఉదయం బడి గంటలు మోగాయి. పెద్దవడుగూరు జెడ్పీ పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం కొనసాగుతోంది. అలాగే దిమ్మగుడి జెడ్పీ పాఠశాలలో తరగతి గదుల కొరత తీవ్రంగా ఉన్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. ఉన్న గదులు శుభ్రంగా లేని కారణంగా విద్యార్థినీ విద్యార్థులు చెట్ల కిందనే కూర్చోబెట్టి చదువులు ప్రారంభించారు. కొందరు బాలురు కూలడానికి సిద్ధంగా ఉన్న గదుల ముందు ఉన్న వరండాలో కూర్చోబెట్టారు.

'ప్రజల ఫిర్యాదులను పరిష్కరించండి'

గుత్తి రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ ఓబులేసు ఆదేశించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సిబ్బందితో తహసీల్దార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 2న కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన పీజీఆర్ఎస్ ఫిర్యాదుల కార్యక్రమంలో మునిసిపాలిటీతో పాటుగా గ్రామాల్లో సమస్యలకు సంబంధించి వచ్చిన వినతులను సమీక్షించాలన్నారు. నిర్ణీత సమయంలోపు ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సమస్య పరిష్కారం చేయని పక్షంలో ఎందుకు చేయలేకపోతున్నామో అర్జీదారుడికి సరైన సమాధానం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీటీ సూర్యనారాయణ, వీఆర్ఓ సురేంద్ర, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుకు అండగా ఉంటా'

పెద్దవడుగూరు: బాధిత రైతుకు అండగా ఉంటానని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని మేడిమాకులపల్లిలో రైతు కంబగిరికి చెందిన చెరకు తోటకు ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అగ్నికి ఆహుతయింది. సుమారుగా 4 లక్షల దాకా నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న అశ్మిత్‌రెడ్డి గురువారం బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చి, కొంత నగదు ఆర్థిక సాయం అందజేశారు.

వ్యక్తి మృతి

గుత్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గుత్తి ఆర్ఎస్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్ఎస్‌కు చెందిన డిష్ చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అతడిని బంధువులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగుళూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుట్లూరు: మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం కరెంట్ సరఫరా లేక ప్రజలకు ఎలాంటి సేవలు అందలేదు. సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పు కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, వ్యవసాయ, గృహ విద్యుత్ సరఫరా సక్రమంగా అందించడం కోసం మరమ్మత్తులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

యల్లనూరు: పుట్లూరు మండలంలోని కోమటికుంట్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంలో యల్లనూరు మండలంలో శనివారం కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ వసంతయ్య, ఏఈ పద్మనాభరెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నిర్మాణం పూర్తికాకనే పగుళ్లు..



నాసిరకంగా నిర్మించిన రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం. (ఇన్‌సెట్‌లో) పగుళ్లిచ్చిన దృశ్యం

తాడిపత్రిటౌన్: జలమే జగతికి ప్రాణాధారం..జలమే ప్రగతికి మూలాధారం అంటూ ఆర్భాటంగా తాడిపత్రి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం నాసిరకంగా తయారైంది. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద గత ఏడాది ఆగస్టులో అధికారులు పనులు ప్రారంభించారు. అయితే నిర్మాణం పూర్తి కాకనే పగుళ్లు వచ్చాయి. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. అయితే ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన ప్రజలు నిర్మాణంలో పగుళ్లు చూసి అవాక్కవుతున్నారు. నిత్యం అధికారులు ఉండే కార్యాలయంలోనే పనులు నాసిరకంగా ఉంటే గ్రామాల్లో నిర్మాణాలు ఎంత మేరకు నాణ్యతగా ఉన్నాయో అర్థమవుతోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నివాళి



లింగన్న మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 12వ వార్డు కథలగేరికి చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు మోతే లింగన్న అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి గురువారం ఉదయం లింగన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతడి కుటుంబసభ్యులైన పార్టీ నాయకుడు మోతే మస్తాన్ తదితరులను పరామర్శించారు. వార్డు కౌన్సిలర్ పెద్ద వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు మల్లికార్జున శాస్త్రి, ఎల్లప్ప, నూర్‌నిజామి తదితరులు పాల్గొన్నారు.

అనువైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి



మాట్లాడుతున్న రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త నారాయణస్వామి

శింగనమల: రైతులు పంటల సాగులో అనువైన విత్తనాలు, రకాలను ఎంపిక చేసుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధ్యమని రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త నారాయణస్వామి సూచించారు. గురువారం మండలంలోని పెరవలి, నాగులగుడ్డం తండా గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అధిక మోతాదులో అందించే ఎరువులు, రసాయనిక మందులకు స్వస్తి పలకాలన్నారు. నూతన పద్ధతులను అవలంభించి, దిగుబడులు సాధించాలన్నారు. పంట సాగులో ముందస్తుగా పచ్చరొట్టె ఎరువులు వేసుకోవాలని, తద్వారా భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త సుధ, ఏఓ అన్వేష్ కుమార్, పశువైద్యాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, మౌనప్రియ, సిబ్బంది విశ్వేశ్వరి, విజయభార్గవి, అనూష, పవన్‌కుమార్, విజయ్, ఫయాజ్, ఉమాదేవి, సంధ్య రాణి, అమరేష్, చంద్రకళ, అఖిల, వీరనారమ్మ, నవీన్, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఈఈ బాధ్యతల స్వీకరణ



ఎంఈ ఇంతియాజ్ అలీ

గుంతకల్లుటౌన్: గుంతకల్లు మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఇంతియాజ్ అలీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనతో పాటు డీఈ రవిప్రకాష్‌నాయుడు, మున్సిపల్ రెవెన్యూ అధికారిగా కె.శ్రీనివాసరావు, ఆడిట్ అధికారిగా సూర్యప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన అధికారులకు సంబంధిత విభాగాల సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

డీటీగా మహబూబ్‌బాషా



పుట్లూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా మహబూబ్‌బాషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ మల్లేష్‌ప్రసాద్ తాడిపత్రికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో యల్లనూరు డీటీ మహబూబ్‌బాషా పుట్లూరుకు బదిలీపై వచ్చారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా రాము



యల్లనూరు: యల్లనూరు తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, సీఎస్‌డీటీగా రాము గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఉరవకొండ డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తూ బదిలీపై యల్లనూరుకు వచ్చానన్నారు. కాగా గతంలో ఇన్‌చార్జ్ డిప్యూటీ తహసీల్దార్‌గా కొనసాగిన మునేంద్ర యల్లనూరు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నారు.